క్లుప్తంగా

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దెందులూరు: రాష్ట్ర ఎస్సీ కమిషన్ విక్టర్ ప్రసాద్‌కు రాష్ట్ర ప్రభుత్వం సఫాయి కార్మికుల సంక్షేమ హక్కుల పరిరక్షణ బాధ్యత కేటాయించడంపై ఏపీ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ల మురళీకృష్ణ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, ఎంఆర్‌పీఎస్ దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కే. మురళి హర్షం వ్యక్తం చేశారు. శనివారం కేఎస్ పురంలో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధి, ప్రణాళికతో కృషి చేస్తోందన్నారు. విక్టర్ ప్రసాద్ నాయకత్వంలో సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారం, అభివృద్ధి జరుగుతుందని విశ్వసిస్తున్నట్టు తెలిపారు.

మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు

దెందులూరు: సంస్థలు, ఏ ఒక్కరైనా మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చట్టాల ద్వారా చర్యలు తప్పవని ఎయిమ్ స్పెషల్ టీం రాష్ట్ర మెంబర్ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి కోడేటి రాంబాబు అన్నారు. శనివారం దెందులూరు మండలం అక్కిరెడ్డిగూడెం కమ్యూనిటీ హాలులో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం రూపొందించిన 125–128 ఆర్టికల్ వరకు మత స్వేచ్ఛ వ్యక్తుల ఇష్టమని కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు ఉద్దేశ్యపూర్వకంగా సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రజలందరూ దుష్టశక్తుల చర్యలను గమనిస్తూ పర మత సహనం, గౌరవంతో ఉండాలని సమాజంలో అన్ని కులాలు, మతాలు, ఐక్యత, సంతోషంతో జీవించాలన్నది అంబేడ్కర్ ఇండియా మిషన్ లక్ష్యమన్నారు. ఈ దిశగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అవగాహన సదస్సులు, సమావేశాలు, కరపత్రాల పంపిణీ చేస్తున్నామన్నారు.

7న జనార్ధనస్వామి కల్యాణ మహోత్సవం

దెందులూరు: మండలంలోని సోమవరప్పాడులో ఈ నెల 7న జనార్ధనస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు చలసాని శ్రీరాములు, ఆంజనేయుల కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రం 7.30 గంటలకు కల్యాణ మహోత్సవం, 8వ తేదీ ఉదయం 11 గంటలకు అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

నూరు శాతం ఫలితాల కోసం కృషి చేయాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో

ఉంగుటూరు: పదో తరగతిలో సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో ఎస్. లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఉంగుటూరు హైస్కూల్లో అమలవుతున్న విద్యావిధానం, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ నూరు శాతం ఫలితాలు సాధించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం బిల్లులు ఎప్పటికప్పుడు వస్తున్నాయని వంట మేస్త్రి అప్పాయమ్మ ఎంఈవోకి తెలిపారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి

ఉంగుటూరు: విద్యార్థి దశ నుంచి పొదుపు అలవాటు చేసుకోవాలని భీమడోలు డివిజన్ ఎల్‌ఐసీ బ్రాంచి మేనేజరు గోవిందు అన్నారు. శనివారం కైకరం హైస్కూల్లో చదువులో ప్రతిభ కనబరిచిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, షీల్డులు బహూకరించారు. ఎల్‌ఐసీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు, అజాది కాఅమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు గోవింద్ అన్నారు. డివిజన్ డవలప్‌మెంటు అధికారి కూనా అప్పారావు, హెచ్‌ఎం చేబ్రోలు శ్రీనివాసు, ఎల్‌ఐసీ ఏజంట్లు పాల్గొన్నారు.

మహిళా శక్తికి 'వైఎస్సార్ చేయూత'

- అతివల ఆర్థిక స్వావలంబనే పథకం లక్ష్యం
- వ్యాపారాలు ప్రారంభించి ఉపాధి పొందుతున్న అక్కా చెల్లెమ్మలు



వట్లూరులో మహిళ ఏర్పాటు చేసుకున్న కిరాణా దుకాణం



చేయూత పథకం ద్వారా పాడి గేదెలు కొనుగోలు చేసిన మహిళ

పెదపాడు: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అతివలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు, అక్కా చెల్లెమ్మల భవిత మార్చేందుకు దేశంలో ఎక్కడా, ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ చేయూత పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చొరవతో అర్హులందరికీ చేయూత పథకాన్ని అందిస్తున్నారు. కుల మత వర్గ బేధం లేకుండా అందరికీ పథకం అందించాలని అధికారులకు ఆయన నిర్దేశిస్తున్నారు. నియోజవర్గంలోని 3,900 డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న 40,770 మందికి రూ.76.43 కోట్లు ప్రభుత్వం ఈ పథకం ద్వారా అందించింది. ఈ పథకంలో భాగంగా ఏటా 45ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అక్కా చెల్లెమ్మలకు రూ.18,750 చొప్పున క్రమం తప్పకుండా వరుసగా నాలుగేళ్లలో లబ్ధిదారులకు రూ.75వేలు ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోంది. ఈ నగదును ఉపయోగించుకుని చిన్న మధ్యతరహా వ్యాపారాలను ప్రారంభించేందుకు, జీవనోపాధి కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారు. దీనిలో భాగంగా మహిళలు గ్రామాల్లో కిరాణా దుకాణాలు, గేదెల కొనుగోలు, వస్త్ర వ్యాపారం, మేకల పెంపకం, పచ్చళ్ల తయారీని ప్రారంభించి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్న వారికి ఐటీసీ, హెచ్‌యూఎల్, పీఅండ్‌జీ, రిలయన్స్, లాంటి కంపెనీలతో ఒప్పందం చేసుకుని మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు అందించడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో పాటు వ్యాపారానికి బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీ నిధి ద్వారా రుణాలు ప్రభుత్వం అందిస్తోంది. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందన్న భావనతో ప్రభుత్వం చేయూత అందిస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటికి 3సార్లు రూ.18,500 చొప్పున లబ్ధిదారులకు అందించింది.

మండలం	డ్వాక్రా గ్రూపులు	గ్రూపుల్లో సభ్యులు	చేయూత సాయం రూ.కోట్లలో
పెదపాడు	1,178	12,089	22.36
పెదవేగి	1,352	14,390	26.98
దెందులూరు	1,050	10,871	20.38
ఏలూరు	320	3,240	6.41
మొత్తం	3,900	40,590	76.13

ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు



డ్వాక్రా గ్రూపుల్లో ఉత్సాహవంతులైన వారికి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారికి ప్రభుత్వం అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తోంది. స్వయం సహాయ సంఘాల సభ్యులు కూడా ముందుకు వస్తున్నారు. వారికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, చేయూత, ఆసరా పథకాలు ద్వారా అందిస్తున్నాం.

– దాసరి సుమలత, ఇన్‌చార్జి ఏరియా కో ఆర్డినేటర్, పెదపాడు

సంతోషంగా జీవనం



మహిళల కోసం గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రభుత్వం అందించిన చేయూత, ఆసరా పథకం ద్వారా ఆర్థిక సాయం ప్రభుత్వం అందించడంతో కిరాణా వ్యాపారం చేస్తున్నాను. నాకు స్వయం ఉపాధి దొరకడంతో సంతోషంగా జీవనం సాగుతోంది.

– సరిహద్దు సత్య శాంతి, కిరాణా దుకాణం యజమాని, పెదపాడు

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు గృహసారథులు



గణపవరం గృహసారథుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వాసుబాబు

గణపవరం: గృహసారథులు చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యవారధిలా వ్యవహరించాలని, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని నిరంతరం పరిశీలించాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపవరం, సరిపల్లె, కొత్తపల్లి, వరదరాజపురం, వెలగపల్లి, జల్లికొమ్మర, అర్ధవరం గ్రామాలకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అర్హులకు సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ నిరంతరం పరిశీలించాలని, అర్హులకు అందకపోతే వెంటనే ఆ విషయాన్ని ప్రభుత్వానికి తెలియ జేయాలని ఎమ్మెల్యే సూచించారు. స్వాతంత్ర్యం వచ్చాక మన రాష్ట్రంలో ఏ ప్రభుత్వమూ ఈ స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేయలేదని అన్నారు. పేదలకు ఎంత మంచి చేసినా తెలుగుదేశం అనుకూల పచ్చ మీడియా ప్రభుత్వంపై అసత్య ప్రచారాన్ని నిరంతరం కొనసాగిస్తూ విషం కక్కుతోందన్నారు. గృహ సారథులు ఈ విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రజలకు వాస్తవాన్ని వివరించి, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, వారి మద్దతు కోరాలని సూచించారు. వచ్చే ఎన్నికలలో గెలవకపోతే తెలుగుదేశం కనుమరుగవుతుందని, అందువల్ల అధికారంలోకి రావడానికి చంద్రబాబుతోపాటు ఆయనకు అనుకూల పార్టీలు, పచ్చ మీడియా ఏకమై కుట్రలు, కుతంత్రాలకు పూనుకుంటాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తతతో ఉండాలని సూచించారు. ప్రజలు వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకు రావడానికి మానసికంగా సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ లక్ష్య సాధనకు మనమంతా శ్రమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలు ప్రజలకు పరిపాలనను అందుబాటులోకి తెచ్చాయన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధులైతే, గృహ సారథులు పార్టీకి, ప్రజలకు మధ్య వారధులని అన్నారు. అందువల్ల గృహసారథులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. దేశంలో కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ తేడాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకై క ప్రభుత్వం మనదేనని అన్నారు. మార్చి 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ గృహసారథులు ఇంటింటికీ తిరిగి మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మిబాబులు, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి నడింపల్లి సోమరాజు, జిల్లా అధికార ప్రతినిధి మాదేటి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల శ్రీను, రొంగల శ్రీను, ఎంఆర్‌కే, తోటశ్రీను, దేవస్థానం చైర్మన్ వంకాయల రామారావు, సర్పంచ్‌లు చనుమూరి లక్ష్మీభవాని, మద్దాల మధు, కోడేటి నర్సింహమూర్తి, కురెళ్ల వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యులు దండు రవి, మద్దాల నాగేశ్వరరావు, బుద్దాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు కొనిశెట్టి రమేష్, బుద్దాల అర్జునరావు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో జీవితంలో ఉన్నతస్థానం



దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సీఈఓ మెహర్రాజ్

దెందులూరు: యువత వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవాలని జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలంటే లక్ష్యం ఏర్పచుకుని ఆ దిశగా కృషి చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సెట్‌వెల్ సీఈఓ ఎండీ మెహర్రాజ్ అన్నారు. శనివారం దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పీ. వెంకట రామశర్మ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఎంచుకున్న రంగంలో లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివి సాధించాలన్నారు. హెచ్‌ఎం రామశర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం మేనేజర్ ఎస్.పట్టాభి, ఏఓ కెనడీ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి



భీమడోలులో మాట్లాడుతున్న తహసీల్దార్ కె.షంషూద్దీన్

భీమడోలు: బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత అధికారులదేనని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని భీమడోలు తహసీల్దార్ కె.షంషూద్దీన్ అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో శనివారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, క్రాప్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మండల బాల్య వివాహాన నిషేధ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత నెలలో గ్రామాల వారీగా జరిగిన బాల్య వివాహాలు, వాటిని అరికట్టేందుకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన షంషూద్దీన్ మాట్లాడుతూ ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజెస్ యాక్ట్ 2006ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కమిటీలు సహకరించాలన్నారు. ఎంపీడీవో జీఎల్ ఎన్ రాఘవన్ మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధాధికారుల కమిటీలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఇతర శాఖల అధికారులు ఉంటారన్నారు. క్రాప్ సంస్థ డైరెక్టర్ ప్రాన్సిస్ తంబీ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆర్.రాజేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిషేధ అధికారుల బాధ్యతలను వివరించారు.

చెత్త ద్వారా సంపద సృష్టి



చిలకంపాడులో వర్మీకంపోస్టు తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

గణపవరం: చెత్త ద్వారా సంపద సృష్టించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం తదితర విషయాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలని గణపవరం ఎంపీడీవో జ్యోతిర్మయి అన్నారు. గ్రామంలోని యూపీ పాఠశాలకు చెందిన 6, 7,8 తరగతుల విద్యార్థులను పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త సంపద కేంద్రం, వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాల వద్దకు క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. విద్యార్థులకు తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను, ఇతర వ్యర్థాలతో వర్మీకంపోస్టు ఎరువు తయారీ విధానం, దానివల్ల కలిగే ఆర్థిక లాభాలు ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ పాదయాత్ర

దెందులూరు: ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం విడనాడి పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కే. మురళికృష్ణ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ మహాపాదయాత్ర శనివారం ఖండ్రిక నర్సింహపురంలో ప్రారంభమైంది. ఖండ్రిక నర్సింహపురం, రామారావుగూడెం, మేధినరావుపాలెం, శ్రీరామవరం, జోగన్నపాలెంలో పాదయాత్ర జరిగింది. ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఎం. నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం. తిరుపతిరావు, చిలకా హరీష్, భీమడోలు రామకృష్ణ, చిలకా విష్ణు, దెందులూరు మండల కన్వీనర్ చొదిమెళ్ల ప్రసాద్, వీరయ్య, రఘు ర్యాలీలో పాల్గొన్నారు.

ఉగాది నాటికి 1,500 గృహ ప్రవేశాలు

భీమడోలు: ఉగాది నాటికి మండల వ్యాప్తంగా 1,500 జగనన్న ఇళ్లు నిర్మించి గృహ ప్రవేశాల చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని మండల ప్రత్యేకాధికారి ఏవీఆర్ గంగాధర రావు అన్నారు. పోలసానిపల్లిలో జగనన్న హౌసింగ్ కాలనీ శనివారం హౌసింగ్ డే పురస్కరించుకుని కాలనీలో నిర్మిస్తున్న గృహాలను మండలస్థాయి అధికారులతో పాటు ఆయన పరిశీలించారు. కాలనీలో నూతన విద్యుత్ లైన్లు, మంచి నీటి పైపులైన్లు పనులను ఆయన పరిశీలించారు. పోలసానిపల్లిలో జగనన్న లేఅవుట్‌లో 48 మందికి ఇళ్ల స్థలాలు అందించగా వాటిలో 30 గృహనిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 18 మందికి డ్వాక్రా రుణం కింద ఒక్కొక్కరికీ రూ.35 వేలను పావలా వడ్డీకి అందజేస్తున్నామన్నారు. ఈనెల 10వ తేదీలోగా ఇప్పటికి ప్రారంభించని ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలన్నారు. గృహాలను నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులను త్వరితగతిన మంజూరు చేస్తుందన్నారు. మండల వ్యాప్తంగా వివిధ కాలనీల్లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లల్లోకి గృహ ప్రవేశాలు చేపట్టేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షంషూద్దీన్, ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్, హసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పంచాయతీరాజ్ ఏఈలు సీహెచ్ సతీష్, కె.రామారావు, రామస్వామి, డి.సత్యనారాయణ, వీఆర్వో, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారుడు ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

పెదపాడు: ప్రతి లబ్ధిదారుడు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని పెదపాడు మండల ప్రత్యేక అధికారి, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు తెలిపారు. పెదపాడు మండలంలోని ఏపూరు గ్రామంలో హౌసింగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని 167 మంది లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి ఒక్కరినీ అధికారులు దత్తత తీసుకోవాలన్నారు. స్థలాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో నిర్మాణం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హౌసింగ్ డీఈ రమాకాంత్ ఈఈ దొరబాబు, పెదపాడు ఇన్‌చార్జి ఏరియా కోఆర్డినేటర్ దాసరి సుమాలత, సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, స్థానిక నాయకుడు బెజవాడ శేఖర్, రాజులపాటి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కోలాహలంగా భీమేశ్వరస్వామి రథోత్సవం



భీమేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: పెదనిండ్రకొను పార్వతీ సమేత భీమేశ్వస్వామి కల్యాణ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారు జామున 4.26 గంటలకు బ్రహ్మశ్రీ కైతేపల్లి బాల సుబ్రహ్మణ్యం పండితులతో స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం కల్యాణ మూర్తులకు రథోత్సవం కోలాహలంగా నిర్వహించారు. సన్నాయి, మేళ తాళాలు, బుట్టబొమ్మలు, తీన్మార్ డప్పులు, కోయ డ్యాన్సులతో స్వామి రథోత్సవం వైభవం నిర్వహించారు. ఇంటి ముందుకు వచ్చిన ఉత్సవామూర్తులను దర్శించుకున్న భక్తులు అరిటి గెలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి రథాన్ని లాగేందుకు చిన్నా, పెద్దా భక్తులు పోటీ పడ్డారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ రథోత్సవంలో పాలొకగని ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ కోడే కాశి, ఉత్సవ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

గణపవరం: వచ్చే ఎన్నికలలో సత్తాచాటి వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో సైనికునిలా పనిచేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఏలూరు జిల్లాలో ఇటీవల నియమితులైన పార్టీ అనుబంధ విభాగాల నాయకులు వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. వాసుబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితోనే విజయం సాధ్యమన్నారు. పార్టీ, దాని అనుబంధ విభాగాలు సమన్వయంతో పనిచేస్తే వచ్చే ఎన్నికలలో 175 సీట్లు సాధించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న లక్ష్యాన్ని సాధించగలమన్నారు. ఈ సందర్భంగా పదవులు పొందిన నాయకులను ఆయన అభినందించారు.

పూళ్లలో బైక్ అపహరణ

భీమడోలు: పూళ్లలో ఓ ఇంటి వద్ద ఉంచిన బైక్ అపహరణకు గురైంది. ఈ నెల 1వ తేదీ రాత్రి గ్రామానికి చెందిన చెందిన ఏనికేపల్లి శివగంగాధర రావు తన స్పైడర్ బైక్‌ను ఇంటి వద్ద ఉంచాడు. తెల్లవారే సరికి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడు శివగంగాధరరావు భీమడోలు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసారు. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

పెదపాడు: పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం మోనూ ప్రకారం నిర్వహించాలని పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తెలిపారు. గుడిపాడు ప్రాథమిక పాఠశాలలో తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయలకు పలు సూచనలు సలహాలు అందించారు. ఉపాధ్యాయులు తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

భీమడోలు: భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి, వేంకటేశ్వర ఆంజనేయ స్వామి వార్ల కల్యాణోత్సవాలు ఏటా కన్నుల వేడుకగా నిర్వహించడం అనవాయితీ. రెండో రోజైన శనివారం స్వామి వార్లకు పల్లకీ సేవ గ్రామ పురవీధుల్లో బలిహరణ, వివిధ విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వార్లను మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. స్వామి వార్ల కల్యాణం ఈనెల 5వ ఆదివారం రాత్రి ఒకే వేదికపై జరగనుంది. వేదిక, ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, దేవస్థానం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.